18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
సోమవారం | 23 డిసెంబర్ 2024 | పేజీలు 8

# మహిళల అభివృద్ధికి పెద్దపీట

చంద్రబాబు విజనరీ రాష్ట్రానికి ఎంతో అవసరం... నారా భువనేశ్వరి



8లో

# అధికారుల పర్యవేక్షణ కరువు

పాకాల గ్రామపంచాయతీలో నిధులు పక్కాదారి

- పంచాయతీలో రెండు సంవత్సరాలు రికార్డులు మాయం
- యం బుక్ లేకనే లక్షలు రూపాయల నిధులు నకిలీ ఓచర్లతో స్వాహా
- పంచాయతీ కార్యదర్శులు చేతివాటం
- మామూళ్ల మత్తులో జిల్లా అధికారులు
- విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖలకు ఫిర్యాదు





**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** జిల్లా ప్రభుత్వ అధికారులు మామూళ్ల మత్తులో మునిగి పోయి తిరుపతి జిల్లా పాకాల గ్రామ పంచాతీకార్యాలయంపై పర్యవేక్షణ కరువవడంతో పంచాతీ కార్యదర్శులు లక్షల రూపాయలు పంచాయతీ నిధులు పక్కదారి మళ్లించి గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి కొట్టారని సమాచారం. మేజర్ గ్రామ పంచాయితీలలో మౌలిక సదుపాయాలు కల్పించి, పారిశుద్ధ్యాన్ని కాపాడి అన్నిరకాల అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 14, 15 ఆర్థిక సంఘం నిధులు, గ్రామ స్వరాజ్ వంటి

మిగతా 2లో

# అక్రమార్కుడికి పొలం కట్టబెట్టారు

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారం
ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు



**బుచ్చినాయుడు కండ్రిగ, మేజర్‌న్యూస్:**
మండలంలోని గాజుల పెళ్లూరు రెవెన్యూ గ్రామంలో అక్రమార్కుడికి భూమిని కట్టబెట్టి అర్హులైన వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న వైనం చోటు చేసుకుంది. గాజుల పెళ్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో సర్వే నంబర్ 285/2 లో ఇలుపురి పోలమ్మకు రెండు ఎకరాలు, సర్వే నెంబర్ 285/4లో ఇలుపూరి లతాకు రెండు ఎకరాల డీకే టీ భూమి ఉంది. సదరు భూమిని గాజుల పెళ్లూరు గ్రామానికి చెందిన కుక్కంబాకు రమణయ్య అక్రమంగా ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నాడు. ఈ అంశానికి సంబంధించి గతంలో 2017లో చిత్తూరు జాయింట్ కలెక్టర్ అర్హులైన వారికి చెందినదని నివేదికలను అందించారు. వీటికి సంబంధించి సర్వే నెంబర్ ఆధారంగా వన్‌బి అడంగల్‌లో తహసిల్దార్ డిజిటల్ సంతకంతో వివరాలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం డిజిటల్ సంతకంరావడం లేదు. వీటికి సంబంధించి సంబంధిత అర్హులైన వారికి సంబంధించిన భూమిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన వినతి పత్రాన్ని అందజేసిన సంబంధిత రెవెన్యూ అధికారులు

మిగతా 2లో

# ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్ట్

ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు



**తిరుపతి బ్యూరో/ తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:**
ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించ మని, పిడి యాక్ట్‌కు సైతం వెనకాడబో మని టాస్క్ ఫోర్స్ ఇన్చార్జ్ ఎస్పి,తిరుపతి ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదివారం ఒక ప్రకటనలో భాగంగా స్పష్టం చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన షేక్ చంపతి జాకీర్‌పై పిడీ యాక్ట్ అములుకు టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ అమలులో భాగంగా టాస్క్‌ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ అధ్వర్యం లో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా, నమోదైన కేసులను నిరూపించే విధంగా దర్యాప్తు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఎర్రచందనం అక్రమ రవాణా దొంగగా 8కేసుల్లో నిందితుడైన వైఎస్ఆర్ కడప జిల్లా, చాపాడు మండలం, ఖాదర్‌వల్లి గ్రామంలో నివాసముండే, ఫకృవల్లి కుమారుడు షేక్ చంపతి జాకీర్ (30)ను అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు సిఫార్సు మేరకు కడప జిల్లా కలెక్టరు,జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఈరోజు పీడీ ఆక్ట్ ఉత్తర్వు జారీచేశారు. ఈ వ్యక్తి విలువైన ఎర్రచందనాన్ని కొల్లగొడుతూ చట్టం పట్ల గానీ, అటవీ,వన్య మృగాల చట్టాలను ఉల్లంఘించి నేరాలు చేస్తూ ప్రజా జీవనానికి ఆటంకం కలిగిస్తున్నందున ఇతనిపై టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు పీడీయాక్ట్

మిగతా 2లో

# గరుడాద్రి నగర్‌లో ఉపవిచారణ కార్యాలయం ప్రారంభం



5లో

# కాణిపాకం ఆలయంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

## రావిగుంటపాలెం సాగునీటి సంఘం అధ్యక్షులుకి సన్మానం

**వాకాడు, మేజర్‌న్యూస్:** మండలంలోని రావిగుంటపాలెం పంచాయతీలో ఇటీవల జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో రావిగుంటపాలెం చెరువుకు అధ్యక్షులుగా ఎన్నికయిన ఇంగిలాల బుజ్జిగేంద్రను ఆదివారం స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. నిడిగుర్తి గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా నాయకులు మాజీ సర్పంచ్ వాకాటి సంపత్ కుమార్, వల్లమేడు చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులు మీజూరు వెంకటేశ్వర్లు తదితరులు శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ అవకాశం కల్పించిన శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్‌కి ధన్యవాదములు తెలిపారు. పెద్దవారితో సఖ్యత గా వుంటూ మరిన్ని ఉన్నత పదవులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమతం శ్రీనివాసులు, పొన్న చిన వెంకటయ్య, ఇంగిలాల మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.



## మన కళలను మనం ఆదరించాలి

**తిరుపతి కల్చరల్, మేజర్‌న్యూస్:** తిరుపతిలో అర్బన్ హాట్ భారతీయ సంస్కృతిక కళలను





ప్రతి ఒక్కరు ఆదరించినప్పుడే ప్రాచీన మన కళా సంస్కృతులు నేటి తరానికి తెలుస్తుంది అని సురభి గాయత్రి అన్నారు. ఆదివారం తిరుపతి సమీపంలోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన భరతనాట్యం కూచిపూడి శ్రీ గురు కృప కళాక్షేత్రం బృందం చే ప్రదర్శనలు నిర్వహించారు. అలాగే జానపద నృత్యాలు ప్రజలను అలరించింది. వారాంతపు సంస్కృతి కార్యక్రమంలో భాగంగా నెల్లూరుకు చెందిన శ్రీ గురుకృప కళాక్షేత్రం బృందం వారు నిర్వహించడం ఎంతో సంతోషదాయమని భక్తులు తెలియజేశారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే కమిటీ సభలు

**పుత్తూరు, మేజర్‌న్యూస్:** పుత్తూరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో వున్న విద్యుత్ వినియోగదారులు సమస్యలు పరిష్కారం కోసమే కమిటీ సభలు నిర్వహిస్తున్నట్లు డిఈ దేవ ఆశీర్వాదం, ఏఈ శంకరయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23,24 తేదిల్లో ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో సబ్ స్టేషన్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలు చర్చించి పరిష్కారం చేసుకోవచ్చు అన్నారు. అందువల్ల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఆటోమొబైల్ రంగానికి స్థలం కేటాయించండి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి ఆటో మొబైల్ మెకానిక్ ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని కలిశారు. తమకు ఆటో మొబైల్ మెకానిక్ ఇంజనీరింగ్ గ్యారేజ్ స్థలం కావాలి అని కోరారు. ఎమ్మెల్యే స్పందించి త్వరలో నే ఆటో నగర్ గ్యారేజి స్థలం సేకరణ చేస్తామని చెప్పడం జరిగింది. శ్రీ కాళహస్తి ఆటో మొబైల్ గ్యారేజ్ సభ్యులు హర్షం వ్యక్తిత్వం జేశారు. అధ్యక్షులు గోపి నాయుడు. ఉపాఅధ్యక్షులు మోహన్ గౌడ్, సెక్రటరీ, ముని గోపాల్, జాయింట్ సెక్రటరీ సాధిక్ బేగ్. ట్రెజరర్ సుబ్రహ్మణ్యం మణి, గౌరవ అధ్యక్షులు రవి నాయుడు. సభ్యులు గురుశంకరయ్య. తిరుపాల్ రెడ్డి సురేష్. మిర్జవాలి. చెంగలరాయులు. మురళి. మునికృష్ణ. తదితరులు పాల్గొన్నారు.



## జనసేన పార్టీ అభివృద్ధికి కృషి చేయండి

**జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వినుత కోటా**

**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇంఛార్జి వినుత కోటా తొట్టంబేడు మండల పార్టీ నాయకులు. జనసైనికులు. వీర మహిళలతో శ్రీకాళహస్తి పట్టణం పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో ప్రజలు సమస్యలు పరిష్కారం, పార్టీ బలోపేతంకి చెయ్యాల్సిన కృషి, నాయకులకు, జనసైనికులకు అధికార భాగస్వామ్యంలో అవకాశాలు. స్థానిక సంస్థలు ఎన్నికలు. 6 నెలలు కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న శాఖల్లో ప్రజలు కోసం చేస్తున్న కృషి గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో మండల ఇన్‌చార్జ్ పేట చంద్ర శేఖర్. మండల నాయ కులు, జన సైనికులు. వీర మహిళ లు పాల్గొన్నారు.




## ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్ట్

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర్వులు అమలులో భాగంగా, కోర్టు ఆదే శాల మేరకు నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించడం జరిగింది. ఎర్రచందనం అక్రమరవాణా నిరోధకంలో భాగంగా స్మగ్లర్లపై పీడీయాక్ట్ అమలు చేయడానికి వెనకాడబోమని టాస్క్ ఫోర్సు ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు హెచ్చరించారు. ఇప్పటికే కొంత మందికి ఐదేళ్ల కారాగార శిక్షలు పడిన విషయాన్ని గుర్తు చేశారు. వీటితో పాటు పీడీ యాక్ట్ కూడా అమలులోకి వస్తుందని తెలిపారు. అటవీ సంరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అని, అరుదైన వృక్ష సంపద ఎర్రచందనాన్ని కాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు.



## అక్రమార్కుడికి పొలం కట్టబెట్టారు

(మొదటిపేజీ తరువాయి)

పట్టించుకోకపోవడంతో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ అంశానికి సంబంధించి రెవెన్యూ సదస్సులో కూడా ఫిర్యాదు చేశారు. వీటిపై అధికారులు ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితులు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఈ భూమికి సంబంధించి కోర్టులో వ్యవహారం నడుస్తున్న నేపథ్యంలో దాని సాకుగా చూపి అధికారులు కాలయాపన చేస్తున్నారు. అక్రమార్కుడికి అప్పనంగా భూమిని కట్టబెట్టి చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చొరవ చూపాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


# అధికారుల పర్యవేక్షణ కరువు

(మొదటిపేజీ తరువాయి)




నిధులు కోట్లు రూపాయలు మంజూరు చేయడం జరుగుతుంది. అయితే కొందరు అవినీతి పంచాయతీ కార్యదర్శులు పంచాయతీ నిధులను యం బుక్ లో నమోదు చేయకనే నకిలీ ఓచర్లతో లక్షలు రూపాయలు దుర్వినియోగం చేశారని అనడానికి పాకాల గ్రామ పంచాయితీ నిదర్శనమని పలువురు గ్రామ పంచాయితీ ప్రజలు ఆరోపిస్తున్నారు.

పాకాల మేజర్ గ్రామ పంచాయితీ కాబట్టి నూతన భవనాలు నిర్మాణం అనుమతి అప్రూవల్ లైసెన్సలు లక్షలు రూపాయలు వసూళ్ళు చేసి స్వాహా చేసినట్లు తెలుసింది. అలాగే ఇంటి పన్ను, నీటిపన్ను లైబ్రరీపన్ను ఇలా అనేకరకాల పన్నులు వసూళ్ళు చేసిన గ్రామపంచాయతీ కార్యదర్శులు చేతి వాటం ప్రదర్శించినట్లు సర్వత్రా విమర్శలు ఉన్నాయి.అయితే గ్రామ పంచాయతీలో పన్నులు ద్వారా నిధులు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులు సమకూరుస్తారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిబంధనలు మేరకు గ్రామ పంచాయితీలో గ్రామ సభ నిర్వహించి గ్రామ సభలో సభ్యులు ఆమోదం మేరకు జీ ఎస్టీ, సిఎఫ్ఎంఎస్ ప్రతి రూపాయి ఖర్చు చేయాల్చి ఉంటుంది. జిల్లా అధికార్లు మండలస్థాయి గ్రామ పంచాయతీ అధికార్లు టోకుమ్మక్కై వారివద్ద భారీ మొత్తంలో ముడుపులు తీసుకొని మామూళ్లు మత్తులో మునిగి పోవడం కారణంగా పంచాయతీ అధికార్లు ,పంచాయతీ కార్యదర్శి లు లక్షల రూపాయల దుర్వినియోగం చేశారని ప్రజలు ఆరోపించారు. గ్రామ పంచాతీ లో ఖర్చు పెట్టె ప్రతి రూపాయి జీ ఎస్టీ, బిల్లులు తో యం బుక్ రికార్డు చేయాల్చి ఉంది.గతంలోపాకాల గ్రామ పంచాయతీ లోసీనియర్ అధికారి పంచాయతీ రాజ్ శాఖ పై అపార మైన అనుభవం ఉన్నందున లక్షలు రూపాయలు పంచాయతీ నిధులను పక్కదారి పట్టించిన గ్రామ కార్యదర్శి అధికారిణి బదిలీ పై ప్రస్తుతం ఐరాల మండలంలోని ఈవో అండ్ పి ఆర్డీ గావిధులు నిర్వహిస్తూ కాణిపాకం గ్రామ పంచాయతీ ఈవో గా ఇన్ ఛార్జిగా భాద్యతలు తీసుకొని విధులు నిర్వహిస్తున్న ట్లు తెలిసింది. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం గ్రామ పంచాయితీ పరిధిలో అభివృద్ధి పనులు జరగాలంటే అంచనా తరువాత కొనుగోలు చేసి జి ఎస్టీ బిల్లుతో రికార్డులో నమోదు చేయాల్చి ఉంది. రికార్డులో నమోదు చేసిన తరువాత గ్రామ పంచాయతీ నుంచి సిఎఫ్ ఎంఎస్ ద్వారా దుకానదారులు బిల్లులు మంజూరు చేస్తారు. అయితే పారిశుధ్య పనులుచేయడానికి వివిధా రకాల వస్తువులు కొనుగోలు ఏ రకమైన ఖర్చులైన దుకాణాల దారులకు సిఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు మంజూరు చేస్తారు. ప్రభుత్వ నిబంధనలుకు విరుద్ధంగా కార్యదర్శులు దుకాణా దారులతో కుమ్మక్కై నకిలీ ఓచర్ల బిల్లులతో గ్రామ పంచాయతీ నిధులను లక్షలు రూపాయలను పంచుకున్నారని సర్వత్రా విమర్శనలు ఉన్నాయి. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రతి ఏడాది జరిగే ఆడిట్ చేసే అధికారులకు మామూళ్ళు ముట్ట చెప్పితే వారు కార్యదర్శులకు అనుకూలంగా ఆడిట్ తప్పుదారి పట్టించడం గమనార్హం. గ్రామ పంచాయతీ నిధులు ఖర్చు చేసేందుకు ఎలాక్ట్రకల్స్, హార్డ్ వేర్ యంత్రాలు, పనిముట్లు,జేసిబి ట్రాక్టర్, కూలీలు, డీజల్,నూతన భవనాలు నిర్మాణాలు కోసం పంచాయతీ అప్రూవల్ వంటివి విధారకాల బిల్లులు దుకాణం దారులు నుంచి జి ఎస్టీ బిల్లులు కలిగిన బిల్లులు తీసుకొని యంబుక్ రికార్డు చేసి ఆడిట్ చేయాల్సిన నిబంధనలు ఉన్నాయి. కార్యదర్శులు పలు రకాల అవినీతీ అవకతవకలు అక్రమాలకు పాల్పడి జిఎస్టీ బిల్లులు బదులు నకిలీ ఆచర్లు తీసుకొని లక్షలు రూపాయలు మింగేసినట్లు తెలిసింది. పాకాల గ్రామ పంచాయతీలో రెండు సంవత్సరాలకు సుమారు 12 లక్షలు రూపాయలు బ్లిషింగ్ పౌడర్ పేరుతో రికార్డులకు ఎక్కించారు. వివిధ రకాల ఖర్చులు పేర్చుతో సుమారు 50 లక్షలు రూపాయలు నకిలీ బిల్లు రికార్డుల్లో నమోదు చేసినట్లు ఉన్నట్లు సమాచారం. అదేవిధానంగా గ్రామ పంచాయితీ కార్యాలయంలో 2018 సంవత్సరానికి సంభందించిన పలురికార్డులు మాయం చేసినట్లు తెలిసింది. మిగిలిన రికార్డుల్లో నకిలీ ఓచర్లతో లక్షలు రూపాయలు దుర్వినియోగం చేసినారని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పేరు చెప్పటానికి ఇష్టపడని కొందరు సిబంది చెప్పుతున్నారు. ఇటీవల మండల అభివృద్ధి అధికారి పరిశీలనలో వెలుగు చూసి జిల్లా స్థాయి అధికార్లు దృష్టికి తీసికెళ్ల తానని చెప్పినట్లు సిబంది చెప్పుతున్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంభందించిన 18 లక్షలు 24 వేల264 రూపాయలు, అలాగే 2020-21ఆర్థిక సంవత్సరంలో 4లక్షలు రూపాయలకు సంభందించిన రికార్డులు మాయం చేసినట్లు సిబ్బంది బహిరంగంగా చర్చించికుంటున్నారు. పాకాల గ్రామ పంచాయతీ రికార్డులలో నమోదు చేసిన గత ఐదు సంవత్సరాలుగా బిల్లులు లక్షలు రూపాయలుగోల్ మాల్, అవినీతి, అవక తవకలు, అక్రమాలుపై విజిలెన్స్ అధికార్లు, అవినీతి నిరోధక శాఖలకు ఫిర్యాదులు చేస్తున్నట్లు స్థానిక ప్రజలు అంటున్నారు. కాబట్టి సంభందించిన జిల్లా ఉన్నత అధికార్లు స్పందించి గత ఐదు సంవత్సరాల లో రికార్డులను సమగ్రంగా పరిశీలిస్తే మరిన్ని అవినీతి అక్రమాలు, అవకతవకలు, వెలుగు చూస్తుందని పలువురు పాకాల గ్రామ పంచాయతీ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## ప్రజా విజ్ఞప్తుల దినం వాయిదా



**గూడూరు, మేజర్‌న్యూస్:** గూడూరులో నిర్వహించ తలపెట్టిన మెగా ప్రజా విజ్ఞప్తుల దినం వాయిదా వేసినట్లు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పేర్కొన్నారు. సోమవారం పివిఆర్ కళ్యాణ మండపంలో కలెక్టర్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలో ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అయితే అనివార్య కారణాల వలన గ్రీవెన్స్ డేను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. తదుపరి తేదిని త్వరరలో ప్రకటిస్తామన్నారు.

## ఎట్టకేలకు రాకపోకలకు మోక్షం

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** నెలకు పైగా రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కున్న తీరప్రాంత



బురదగాలి కుమ్మరిపాలెం పంచాయతీ పరిధి లోని గ్రామాల ప్రజలకు మోక్షం లభించింది. స్థానిక పంచాయతీ సర్పంచ్,కార్యదర్శి ఆధ్వ ర్యంలో ఆదివారం రోడ్డు పనులను చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయి దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి స్థానికంగా కార్మికులు, విద్యార్థులు, ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదు ర్కొన్నారు. పలుమార్లు పాలకులకు మొరపెట్టుకున్నా పెడచెవిన పెట్టారు.ఎట్టకేలకు ఆదివారం దెబ్బతిన్న రోడ్డుకు పైపులు ఏర్పాటు చేసి, రాకపోకలను పునరుద్ధరించడంతో స్థానికుల పలు వురు హర్షం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఎర్రమట్టి రోడ్డులో గుంతల మయమైన రహ దారిలో ఎగుడు దిగుడు ప్రయాణాలతో అల్లాడుతున్న తీరప్రాంత ప్రజానీకానికి ఎడారిలో బిజ్లలరీ వాటర్ దొరికినంత ఉపశమనం లభించినట్లు కొందరు తెలిపారు. గొల్లలనట్టు నుండి బురదగాలి కుమ్మరిపాలెం వరకు ప్రధాన రహదారి మరమత్తులు చేపట్టాలన్నారు.

## జనసేన ఆత్మీయ సమావేశం

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని జనసేన పార్టీ నాయకులు రాష్ట్ర మాల



కార్పొరేషన్ డైరెక్టర్, జీడి నెల్లూరు జనసేన పార్టీ ఇంచార్జ్ యుగంధర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది. వెదురుకుప్పం మహాభారతం మిట్ట వద్ద జరిగిన సమావేశంలో యుగంధర్ మాట్లా డుతూ జనసేన పార్టీ వైపు అధిక సంఖ్యలో యువత చేరడానికి ఉత్సాహం చూపుతున్నారని, అటువంటి వారికి జనసేన పార్టీ అండదండలు మెండుగా ఉంటాయని భరోసా ఇచ్చారు. గొడుగు చింత పంచాయతీ సర్పంచ్ బాబు కుమారుడు మధు జనసేన పార్టీ కండువా కప్పు కున్నారు. వేణుగోపాలపురం గ్రామానికి చెందిన యువ నాయకుడు చంద్రశేఖర్ సహచర బృందానికి యుగంధర్ భరోసా కల్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండ లాల అధ్యక్షులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. మండల కేంద్రమైన వెదురుకుప్పంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జన సైనికులు నివాళులర్పిం చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నమయ్య ఇల్లు కూల్చిన చోటే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

### అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి డిమాండ్

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** తిరుమలలో శ్రీవారి వేల సంకీర్తనలు రాసిన అన్నమా



చార్యుల యొక్క ఇల్లును కూలదోసిన చోటే అన్నమయ్య విగ్రహాన్ని ప్రతిష్టించాలని స్థానిక బిటిఆర్ కాలనీలోని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర్‌స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా ముందు ఆ పీఠం సభ్యులు జయశంకర్, దేవా, రజిని, జయమ్మ, నారాయణ, స్వప్న, అనిషా, చంద్రకళలతో కలిసి విజయ శంకర స్వామి మాట్లాడుతూ ఈనెల 24న జరుగునున్న టీటీడీ పాలక మండలి సమావేశంలో తమ న్యాయమైన డిమాండ్‌ను చర్చించి అన్నమాచార్య విగ్రహాన్ని, అలాగే గృహాన్ని పునర్ నిర్మించాలని కోరారు.

## నేడు హజరత్ సయ్యద్ షా సర్దార్ గందోత్సవం

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సమీపంలో వెలసిన



హజరత్ సయ్యద్ షా సర్దార్ అవులియా జలాలి వారి గందోత్సవం సోమవారం రాత్రి గందోత్సవం, పాతియా, మంగళవారం రాత్రి నాగపూర్ చెందిన రబియా తాజ్, కర్ణాటకకు చెందిన అలీ మస్తాఖ వారిచే గొప్ప పాటకచేరి నిర్వహించడం జరుగుతుం దని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి హిందూ ముస్లిం సోదరులు హాజరై విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు తెలిపారు.

## జలసిద్దేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ ఏర్పాటు

**వాకాడు, మేజర్‌న్యూస్:** మండలం నెల్లిపూడి పంచాయితీ వెంకటరెడ్డిపాళెం గ్రామంలో వెలసి ఉన్న కామాక్షిదేవి సమేత జలసిద్దేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించి ఆదివారం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు అయ్యింది. నూతన ఆలయ కమిటీ చైర్మన్‌గా బి.కస్తూరయ్య, వైస్ చైర్మన్లుగా కె.హరీష్, ఎం కోటయ్య, ట్రెజరర్‌గా సూరిశెట్టి విజయ కుమార్ ఎన్నికయ్యారు, ఈ కార్యక్రమంలో బాలు, మురళి, ఏం బేటి పోలయ్య, వెంకటసుబ్బయ్య, జగన్, అనిల్ రెడ్డిలు ఎన్నికయ్యారు. ఆలయ



అభివృద్ధికి కమిటీ పని చేస్తుందని ట్రెజరర్ విజయ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రావ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో..స్వేచ్ఛకు సంకెళ్లు వేశారు

### కూటమి పాలనలో స్వేచ్ఛకు కేరాఫ్‌గా మార్చారు
### కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్



**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం లో స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తే నేడు ఎన్డీఏ కూటమి పాలనలో అదే స్వేచ్ఛకు కేర్‌ఆఫ్‌గా రాష్ట్రాన్ని మార్చారని టిడిపి నాయకురాలు, 48వ డివిజన్ కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడు తూ నిన్నటి రోజున వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన జన్మదిన వేడుకల కార్యక్రమంలో భాగంగా తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు.గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కడమే కాకుండా, ప్రజాక్షేత్రంలో ఎలాంటి కార్యక్రమాలు చేయనీయకుండా ఉక్కు పాదం మోపిన విషయాన్ని కరుణాకర్ రెడ్డి గుర్తు చేసుకోవాలన్నారు.ఐదేళ్ల పాలన మొత్తం అవినీతి, అరాచకాలు, భూకబ్జాలు, దోపిడీలు, హత్యాకాండలు, ప్రశ్నించిన వారిపై దాడులు, దౌర్జన్యాలు చేసిన ఘనత వైసిపి దేనిని మండిపడ్డారు. 2019లో చంద్రబాబు ఓడిపోయిన తరువాత మూడేళ్ల వరకు ప్రజాక్షేత్రంలోకి రాలేదని భూమన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, వెంటనే రాష్ట్రపతి పాలన పెట్టాలని ఢిల్లీ వెళ్లి వైసీపీ అధినేత ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్ల వైసిపి అరాచక పాలనకు భిన్నంగా, నేడు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు రాష్ట్రంలోని ప్రతిపక్ష నాయకులకు ఎంతో గౌరవం ఇచ్చి వారిని స్వేచ్ఛగా తిరగడానికి వీలు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలు సైతం ఏ బాధర బందీ లేకుండా హాయిగా ఎవరి పని వారు ప్రశాంతంగా చేసుకుంటున్నారన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేతలు దిగజారుడు మాటలు మాట్లాడటం ఆపాలని హితవు పలికారు. సమావేశంలో టిడిపి నాయకులు శంకర్ యాదవ్, తిరుపతి పార్లమెంట్ బిసి సాధికార కమిటీ కన్వీనర్ కోనంగి శ్రీరాములు, బాల, శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి సహకారమందిస్తాం

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** అనేక మంది విద్యార్థుల భవిష్య



త్తుకు బాటలు వేసిన పిసిఆర్ ఉన్నత పాఠ శాల అభివృద్ధికి పూర్తి సహాయ సహ కారాలు అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలియజేశా రు. ఆదివారం స్థానిక పిసిఆర్ ఉన్నత పాఠశాలలో 1993-94 కెసిఆర్ ఉన్నత పాఠశాలబ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరి గింది. పూర్వ విద్యార్థులు తమ విద్యార్థి దశలోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, మురు గేషన్ రామచంద్రారెడ్డి, సత్యమూర్తి విద్యార్థులతో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ కెసిఆర్ ఉన్నత పాఠశాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓ ప్రత్యేక గుర్తింపు ఉండేదని విద్యలోనూ స్పోర్ట్స్‌లోను ప్రతిభ చాటే వారన్నారు. నాడు 4000 మంది విద్యార్థులతో కలకలలాడిన విద్యాలయం నేడు 300 మంది విద్యార్థులకు పరిమిత కావడం చాలా బాధాకరంగా ఉంద న్నారు. పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కెసిఆర్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న అనేకమంది విద్యార్థులు నేడు ఉన్నత స్థానాల్లో ఉద్యోగాల్లో ఉన్నారని కెసిఆర్ అభివృద్ధి కోసం తమ వంతు సహాయం అందించాలని పిలుపునిచ్చారు. 30 సంవత్సరాల తర్వాత కలుసుకున్న పిసిఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాల ఆవరణంలో తిరుగుతూ ఎంతో ఆనందంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ గడిపారు. ఈ కార్యక్రమంలో 1993 -94 పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## వికలాంగులకు అన్నదానం చేయడం ఆనందంగా ఉంది

### జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిన మధుబాబు

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** అన్ని దానాల్లోకెల్లా అన్నదానం చాలా గొప్పదని, అలాంటి అన్నదానం వికలాంగులకు చేయడం మరింత ఆనందంగా ఉందని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా



ఉపాధ్యక్షుడు బత్తిన మధుబాబు అన్నారు. ఆదివారం 65వ ప్రపంచ వికలాంగుల దినోత్సవం సంద ర్భంగా స్థానిక బాబు జగ్జీవన్ రావ్ భవనం లో ఉమ్మడి చిత్తూరు జిల్లా వికలాంగుల సంఘం ఆత్మీయ సమావేశం జిల్లా అధ్యక్షుడు రెడ్డయ్య అధ్యక్షతన జరిగింది. బత్తిన మధుబాబు 250 మంది వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలతో, డొక్కా సీతమ్మ స్ఫూర్తితో, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశాలతో, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ సూచనలతో ఈ అన్నదాన కార్యక్రమం చేయడం జరిగిందని ఆయన వివరించారు. జిల్లాలోని వికలాంగులకు జనసేన అన్ని విధాలుగా అండగా ఉంటుందని మధుబాబు హామీ ఇచ్చారు.

## ఇల్లు కూల్చి తమను రోడ్డు పాలు చేశారు

### తమ భూమి కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం
### భూ బాధితుడు కారుమంచి చంద్రబాబు

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** గత 58 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న భూమిలో ఇల్లు నిర్మించుకుని వ్యవసాయం చేసుకుంటున్నామని, అలాంటి ఇళ్లను అర్ధరాత్రి రెవెన్యూ మరియు పోలీసు అధికారులు దౌర్జన్యంగా కూల్చివేసి తమ కుటుంబాలను రోడ్డుపాలు చేశారని భూబాధితుడు కారుమంచి చంద్రబాబు కన్నీటి పర్యంతమయ్యారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1971లో అప్పటి ఇందిరమ్మ ప్రభు త్వం తమ తండ్రి కారుమంచి మునస్వామికి వేదాంతపురం పంచాయతీ, అవిలాల గ్రామం, సర్వే నెంబర్లు 513/16, 513/19లో రెండు ఎకరాల భూమిని ఇవ్వడం జరిగింద న్నారు. అప్పటినుంచి తన ఐదుగురు అన్నదమ్ములు మరియు కుటుంబ సభ్యులు కలిసి అక్కడే ఐదు గృహాలను ఏర్పాటు చేసుకుని వ్యవసాయం చేసుకుంటున్నామని తెలిపారు.ఎన్ని కష్టాలు వచ్చినా,తిన్న తినకపోయినా భూమిని వదిలి పోకుండా గత 58 ఏళ్లుగా అక్కడే బ్రతుకు వెల్లదీస్తున్నామని వాపోయారు. వేదాంతపురం పంచా యతీలో డబ్బున్న వాళ్లు అక్రమంగా ప్రభుత్వ స్థలాలలో అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్న రెవెన్యూ సిబ్బందికి కనిపించదు వినిపించదు. అదే ఒక పేదవాడు చిన్న గుడిసె వేసుకున్నా..వెంటనే స్పందించి చట్టపరంగా చర్యలు తీసుకుని,ఆ గుడిసెలను నేలమట్టం చేస్తారని మండిపడ్డారు.తమకు న్యాయపరంగా అప్పటి ఇందిరమ్మ ప్రభుత్వం ఇచ్చిన భూమి కోసం ఎంతటి పోరాటానికైనా తాము సిద్ధమేనని స్పష్టం చేశారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి తమ 5 కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన చేతులెత్తి వేడుకున్నారు. సమావేశంలో చంద్రబాబు ఐదుగురు అన్నదమ్ముల కుటుంబ సభ్యులు, తండ్రి కారుమంచి మునస్వామి పాల్గొన్నారు.



# ఎంపికైన దివ్యాంగులకు మూడునెలల్లో ఉచితంగా సహాయ పరికరాలు

## – ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి



**పలమనేరు, మేజర్‌న్యూస్:** అంగవైకల్యం కలిగిన వారి అందరికి వారికి అవసరమైన సహాయ పరకాలను ఉచితంగా గుర్తింపు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని పలమనేరు నియోజకవర్గం శాసన సభ్యులు యన్.అమరనాద్ రెడ్డి పేర్కొన్నారు.భారత ప్రభుత్వ సంస్థ (ఏఎల్ ఐ ఎంసిఓ ) ద్వారా జిల్లాలో ఈ నెల 17 నుండి 24వ తేది వరకు విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులకు ఉచితంగా సహాయ పరికారములు నమోదుకు ప్రత్యేక గుర్తింపు శిబిరం లో బాగంగా ఆదివారం పలమనేరు మున్సిపాలిటీ, ప్రభుత్వ బాలికల పాఠశాల నందు పలమనేరు నియోజకవర్గం పరిధిలోని విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధులకు సహాయ పరికరాలు నమోదుకు గుర్తింపు శిబిరాన్ని ఆర్‌డిఓ పి.భవాని,విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వై.శ్రీనివాస్,జిల్లా వ్యవసాయ అధికారి మురళి కృష్ణ,లతో కలసి ఎమ్మెల్యే యన్.అమరనాద్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చిత్తూరు జిల్లాలోని దివ్యాంగులు, వయో వృద్ధులకు ఉచితంగా సహాయ పరికరాల పంపిణీకి జిల్లా విభిన్న ప్రతిభావంతులు,హిజ్రాలు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం సామాజిక న్యాయ సాదికారిత మంత్రిత్వ శాఖ వారి సౌజన్యంతో కృత్రిమ అవయవాల తయారీ సంస్థ( ఏ ఎల్ ఐ ఎం సి ఓ )కాన్పూర్ సహాయ పరికరాల గుర్తింపు శిభిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల కు సహాయ పరికరాల వినియోగం తప్పనిసరి అయినవారికి, అర్హతను బట్టి ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ ఉపకరణములకు గుర్తించబడునని తెలిపారు. ఇక్కడికి వచ్చిన విభిన్న ప్రతిభావంతుల సమస్యలను తెలుసుకుని ప్రతి ఒక్కరికి మేలు చేకూరేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ అవకాశాన్ని పలమనేరు నియోజకవర్గం పరిధిలోని విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధు లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిభిరం ద్వారా ఉచితంగా చేతి కర్రలు, వాకర్లు, మూడు కాళ్ళ చేతి కర్రలు, నాలుగు కాళ్ళ చేతి కర్రలు, వాకర్స్, చంక కర్రలు, వీల్ చైర్లు, చెవి వెనుక ధరించే వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రై సైకిల్, మూడు చక్రాల సైకిళ్ళు , రోలోటర్స్, యం.ఎస్.కిట్స్, అంధుల చేతి వాచ్, అంధుల చేతి కర్రలు, టచ్ ఫోన్, వాయిస్ ఫోన్, ఎల్ బో క్రచస్, బారైన కుష్టు వ్యాధి గ్రస్తులకు లోప్రేసి కిట్లు, డైసి ప్లేయర్, యం.యస్.ఐ.డి. కిట్స్, స్మార్ట్ కెన్ కృత్రిమ అవయములు మొదలగు వివిధ రకములైన ఉపకరణములు పంపిణీ కొరకు గుర్తించబడినవని తెలిపారు. శిభిరమునకు వచ్చువారు రేషన్ కార్డు, ఆదార్ కార్డు, ఆదాయ ధృవీకరణ,సదరన్ పత్రము,4-ఫోటోలు, మొబైల్ నెంబర్, పత్రములు క్యాంపు కు వచ్చు సమయంలో 2-సెట్స్ జిరాక్స్ తీసుకోని రావలెనన్నారు. దివ్యాంగులు మరియు వయోవృద్ధులను ఏవరికీ ఏ పరికరం అవసరమో గుర్తింపు ఎంపిక చేయడం ఈ శిబిరముల ముఖ్య ఉద్దేశ్యంమని, సహాయ సంచాలకులు వై.శ్రీనివాస్ మాట్లాడుతూ పలమనేరులో నిర్వహించిన శిబిరానికి 861 మంది హాజరు కాగా అందులో 835 మంది వివిధ రకాల పరికరాలకు అర్హులు,25 మంది అనర్హులుగా ఉన్నారని తెలిపారు.ఈ క్యాంపులు 23 న సోమవారం కుప్పం ఆర్ టి సి బస్ స్టాండ్ దగ్గర గల రాజ వారి పార్క్ నందు 24న మంగళవారం రామకుప్పం జెడ్ పి హైస్కూల్ నందు విభిన్న ప్రతిభావంతులు వయోవృత్తుల పరీక్షించి ఎంపిక చేసేందుకు ప్రత్యేక గుర్తింపు శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఐ. ఎంసిఓ సంస్థ డాక్టరు, పలమనేరు నియోజకవర్గం పరిధిలోని తహశీల్దార్లు, యం పిడిఓలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం విఐపీ విరామం సమయంలో ప్రముఖ సినీ నటుడు మంచు విష్ణు, అరకు ఎంపీ తనూజ రాణిలు వేర్వేరుగా స్వామి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు.





# డిఎంహెచ్ఓగా సుధారాణి బాధ్యతలు స్వీకరణ



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా సుధారాణి ఆదివారం నగరంలోని స్థానిక జిల్లా వైద్యా ఆ రోగ్య శాఖ అధికారి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, విధి నిర్వహణలో అలక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. గతంలో చంద్రగిరి నియోజక వర్గంలో అదనపు ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ పదోన్నతి పై చిత్తూరు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించడం జరిగిందన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారికి అడిషనల్ డీఎంహెచ్వో వెంకట ప్రసాద్ ఇతర వైద్య సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

# శివయ్య సేవలో సుప్రీంకోర్టు జడ్జి జెకె మహేశ్వరి

**శ్రీకాళహస్తి అర్బన్, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంకు సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా జడ్జి జెకె మహేశ్వరి కుటుంబ సభ్యులతో ఆదివారం శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి విచ్చేశారు. వారిని దేవస్థానం డిప్యూటీ ఈవో ఎన్ఆర్ కృష్ణారెడ్డి స్వాగతం పలికి శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ప్రత్యేక దర్శనం చేయించారు. శ్రీ మృత్యుంజయ స్వామి సన్నిధానం వద్ద సుప్రీంకోర్టు జెకె మహేశ్వరి వారిని దేవస్థానం డిప్యూటీఈవో ఎన్ ఆర్ కృష్ణారెడ్డి శేష వస్త్రంతో సత్కరించి శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి తీర్థప్రసాదాలను చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీవో ఎన్.ఆర్ కృష్ణారెడ్డి ఏ.ఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపర్డెంట్ అండ్ సి.ఎస్.ఓ నాగభూషణం యాదవ్, అడిషనల్ డిస్టిక్ జడ్జి శ్రీనివాస్



నాయక్, అడిషనల్ డిస్టిక్ గురునాథం. పి.ఆర్ఓ రవి టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శన్ పాల్గొన్నారు.

# విమానాశ్రయంలో మంత్రి పార్థసారథికి సాదర స్వాగతం







**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుమల తిరుపతి రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కి శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య, గృహ నిర్మాణ శాఖ డిఈ శ్రీరాములు పుష్ప గుచ్చాలు అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం మంత్రి తిరుమలకు రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్ళారు. మంత్రి నేడు ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు.

# అయ్యప్ప స్వామికి పూజలు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలో ఉన్న 16 స్తంభాలు మండపంలో అయ్యప్ప స్వామిని కొలువు తీర్చి విశేష పూజలు నిర్వహించి దీప దూప నైవేద్యాలు సమర్పించారు.





# పట్ట భద్రుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

**కుప్పం, మేజర్‌న్యూస్:** ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నిక లకు తెలుగుదేశం, బీజేపీ, జనసేన..కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆల పాటి రాజేంద్ర ప్రసాద్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాజేంద్ర ప్రసాద్ విజయం కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా కూటమి నాయకులు కార్యకర్తలు మరియు వివిధ ప్రజా సంఘాలు గుంటూరు వివాహ కన్వెన్షన్ లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముక్య అతిథిగా కుప్పం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ చైర్మన్ ,గవర్నమెంట్ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ను గెలిపించడానికి ఉమ్మడి గుంటూరు జిల్లా కూటమి నాయకులు, కార్యకర్తలు కృషి చేసి ఘన విజయంతో గెలిపించాలని ఆయన కోరారు.

# నేడు మీకోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని నేడు ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించనున్నట్లు, ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందించవచ్చుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గమనిక: అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపర్చాలని అదనపు కమిషనర్ తెలిపారు.

# శివయ్య సేవలో ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివకుమార్



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ ఐటీడిపి స్టేట్ సెక్రటరీ శివకుమార్. వారి మిత్రులు ఆదివారం శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనార్థం విచ్చేశారు. వారికి రాహు కేతు పూజలు చేయించి దర్శనం ఏర్పాటు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బాలాజీ. ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.






# గరుడాద్రి నగర్‌లో ఉప విచారణ కార్యాలయం ప్రారంభం

**తిరుమల, మేజర్ న్యూస్:** శ్రీవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చే సామాన్య భక్తులు తిరుమలలో సులభంగా వసతి పొందేలా చర్యలు చేపట్టినట్లు టీటీడీ ఈవో జె.శ్యామలరావు తెలియజేశారు. ఆదివారం తిరుమలలోని గరుడాద్రి నగర్ కాటేజీ వద్ద ఆధునీకరించిన ఉప విచారణ కార్యాలయాన్ని అదనపు ఈవో వెంకయ్యతో కలిసి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమలలో సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. అందులో భాగంగా తిరుమలలోని అన్ని వసతి గదులు, విశ్రాంతి గృహాలు వద్ద సర్వే నిర్వహించి మెరుగైన సౌకర్యాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. తిరుమలలోని 42 ఉప విచారణ కార్యాలయాలను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ గదుల కరెంట్ బుకింగ్ లో కేంద్రీయ విచారణ కార్యాలయంపై అధిక భారం పడుతుండటంతో గదుల కేటాయింపు ప్రక్రియను వికేంద్రికరించినట్లు చెప్పారు. ఉప విచారణ కార్యాలయాల వద్ద గదులు పొందడం, ఖాళీ చేయడం సులభతరమవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈఓ గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, సిఈ సత్య నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జీసస్ ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి : ఎమ్మెల్యే గురజాల



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు ప్రజలపై జీసస్ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆకాంక్షించారు. ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే ఆదివారం నగరం లోని కొంగారెడ్డిపల్లి బిటి చర్చ్, చర్చి వీధిలోని టౌన్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్నారు. మత పెద్దలు, స్థానిక క్రైస్తవులతో కలిసి కేక్ కట్ చేశారు. ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రైస్తవలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జీసస్ ఆశీర్వాద ప్రతి ఒక్కరికీ ఉండాలన్నారు. సేవ చేయాలనే మనస్తత్వం ఎక్కువగా క్రైస్తవుల్లో కనిపిస్తుందని, ఇదే భావంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. చర్చల్లోని ఫాదర్‌లకు గౌరవ వేతనాన్ని పెంచడంపై క్రిస్మస్ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకుంటానని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ ఎస్ అముద, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, కార్పొరేటర్ అశోక్, పలువురు మత పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం నగరంలోని మంగసముద్రం హౌసింగ్ కాలనీలోని శ్రీ మునీశ్వర స్వామి వారి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొని స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. తదనంతరం ఎమ్మెల్యే బలిజ సంఘం నాయకులు ఓజీ.రామదాసును సాంబయ్య కండిగలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.



# కాణిపాకం ఆలయంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

**ఐరాల మేజర్‌న్యూస్:** కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో ఆదివారం వేకుజమానుంచే అయ్యప్ప స్వామి భక్తులు క్యూలైన్లలో కిట కిట లాడుతూ స్వామివారి దర్శనం కోసం బారులు తీరినారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండాఆలయ ఈవో కె.పెంచల కిషోర్ ముందు జాగ్రత్త చేయగా తగు చర్యలు తీసుకున్నారు. శ్రీ స్వామివారి ఆలయమునకు పోటెత్తుతున్న అయ్యప్పస్వాముల భక్తుల తాకిడి, శబరిమలై తలపిస్తున్న కాణిపాకం,కార్తీక మాసం కావడంతో శబరిమలై వెళ్లే అయ్యప్ప స్వామి భక్తులు వారు ముందుగా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శనం చేసుకుకొని తరువాత శబరమలై కి వెళ్లడం అనువాయితిగా మారింది. అందులో భాగంగానే ఆలయ పార్కింగ్ ప్రదేశాలు దేవస్థానం పరిసరాల్లో అయ్యప్ప భక్తులతో సందడి వాతావరణం, ఉదయం నుంచి రోడ్లలో బారులు తీరుతున్న భక్తులు, దేవస్థానం వారు అయ్యప్ప భక్తులకు పార్కింగ్ ప్రదేశాల్లో స్నానలు తగిన సౌకర్యాలను ఆలయ అధికార్లు ఏర్పాటు చేశారు.



# గణిత మేధావి శ్రీనివాస రామానుజం : ప్రిన్సిపాల్ జయంతి

**చిత్తూరు, మేజర్‌న్యూస్:** గణిత శాస్త్రంలో అపర మేధావి శ్రీనివాస రామానుజం అని ఆయనను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు గణిత శాస్త్రాన్ని పఠించాలని కేశవరెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ జయంతి పిలుపునిచ్చారు. ఆదివారం జాతీయ గణిత దినోత్సవ సందర్భంగా పాఠశాలలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని విద్యార్థిని విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన ప్రాజెక్టులను తయారు చేయించి ఎగ్జిబిషన్ రూపంలో పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేయడంతో విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు తిలకించడం జరిగింది. అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు గణిత దినోత్సవాన్ని సంబంధించి పలు రకాల వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ 14 సైతం నిర్వహించి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జయంతి మాట్లాడుతూ గణిత శాస్త్రంలో అపర మేధావి శ్రీనివాస రామానుజన్ అని ఆయన అడుగు జాడల్లో ఆయనను పూర్తిగా తీసుకొని విద్యార్థినీ విద్యార్థులు గణిత శాస్త్రంలో తమ మేధోసంపత్తి వినిపించుకోవాలని పిలుపునిచ్చారు. గణిత శాస్త్రంలో మంచి ప్రావీణ్యం సాధించగలిగితే విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను అవలీలగా చేరుకోగలరు అని అన్నారు. పాఠశాలలో గణితంలో మేధావులైన ఉపాధ్యాయుల చేత విద్యార్థులకు గణిత విద్యా బోధన తమ పాఠశాల చైర్మన్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో అందిస్తున్నామని అన్నారు. అనంతరం గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆహ్లాదకరమైన వాతావరణంలో నృత్య పోటీలను సైతం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయునిలు హరిత, కిరణ్, కిషోర్, నజీర్ భాష, శ్రీకాంత్, జ్యోతిశ్వర్, వంశి, శాంత కుమార్, సతీష్, హేమలత తదితరులు పాల్గొన్నారు.



# భక్తజన సంద్రంగా బోయకొండ

## – భక్తులకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తప్పవు: ఈఓ ఏకాంబరం



**చౌడేపల్లి మేజర్‌న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రం,భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి బోయకొండ గంగమ్మ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాస అనంతరం వచ్చిన ఆదివారంతో ఇటు ఆంధ్రదేశ్ అటు కర్ణాటక, తమిళనాడు నుండి భక్తులు అధికంగా వచ్చారు, భక్తులు ఉదయం నుండి క్యూలైన్లలో అమ్మవారి మొక్కులు తీర్చుకోవడానికి బారులు తీరారు. ప్రధాన అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి, ఉపకమిషనర్ ఏకాంబరం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఉచిత ప్రసాదాల వద్ద తోపులాటలు లేకుండా అందరూ క్యూలైన్లో వెళ్ళి ప్రసాదాలు తీసుకొనే విధముగా సిబ్బందిని ఆదేశించారు. అమ్మవారి బలిపీఠము వద్ద జంతుబలులను,అక్కడ గల సౌకర్యాలను, అలాగే తలల వేలం పాటవద్ద గల భక్తులతో చర్చించి, వేలం పాట సవ్యంగా జరుగుతున్నదా లేదా అనేవిషయాలపై, సిబ్బంది భక్తులతో మాట్లాడుతున్న తీరుపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. కళ్యాణ కట్ట వద్ద భక్తులకు తలనీలాలు సమర్పించే భక్తులు టికెట్టు ద్వారానే తలనీలాలు సమర్పించాలనీ, ఎవరికీ అధనంగా పైకం చెల్లించవద్దని భక్తులకు తెలియజేశారు. కళ్యాణ కట్టలో ఎవరైనా సిబ్బంది చేతివాటం ప్రదర్శినట్లు కార్యాలయం దృష్టికి వస్తే ఖచ్చితమైన చర్యలు ఉంటాయని కళ్మాణ కట్ట సిబ్బందిని హెచ్చరించారు. అంతే కాకుండా అనునిత్యం సమాచార కేంద్రం నుండి ఆలయ ప్రాంగణం లో జేబుదొంగలున్నారని, తమ విలువైన వస్తువులు జాగ్రత్తగా చూసుకోవాలని, ఎవరికైనా ఏదైనా అసౌకర్యం కలిగినా, ఎవరైనా పిల్లలు తప్పిపోయినా పరిపాలనా కార్యాలయం ఎదురుగా గల సమాచార కేంద్రంలో సంప్రదించాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సూపరింటెండెంట్ రామనాథం, సుధాకర్ రెడ్డి, మణి తదితరులు ఉన్నారు.



# ప్రమాదం స్థితిలో శ్రీపురం– ఆందోళనలో గ్రామస్తులు



**పూతలపట్టు మేజర్‌న్యూస్:** మండలం లోని పి కొత్తకోట గ్రామపంచాయతీ పరిధిలోని బెంగళూరు – నాయుడుపేట జాతీయ హైవే పక్కన ఉన్న శ్రీపురం ప్రమాదం స్థితిలో చేరుకుంటుందని శ్రీపురం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు గత ఆరు సంవత్సరాల క్రితం బెంగళూరు నాయుడుపేట జాతీయ హైవే నూతనంగా నిర్మాణ పనులు పూర్తి చేశారు ఈ జాతీయ రహదారి హైవే పక్కన ఉన్న శ్రీపురం వద్ద రోడ్డు నిర్మాణం కోసం వెడల్పు చేశారు అయితే శ్రీపురం పక్కన వర్షం పడడం కారణంగా రోజురోజుకీ మట్టి పిల్లలు పడిపోయి విద్యుత్ స్తంభాలు, నివాసాల్లో ఉన్న ఇల్లులు పడిపోయే స్థితిలో ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇదివరకే సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయిన మా గోడు పట్టించుకునే నాధుడే లేదని అన్నారు కూలి జీవనంతో కుటుంబాలు పోషించుకుంటున్నాము మాకు ఎలాంటి స్థిరాస్తులు లేవు మేము నిరుపేద కుటుంబాలకు చెందిన వారము మేము నివాసం ఉన్న ఇల్లులే మాకు స్థిరాస్తులు జాతీయ హైవే రోడ్డు నిర్మాణం పనులు చేసిన వారు మా ఇల్లులు పక్కన శాశ్వతంగా సైడు గోడలు నిర్మించకపోవడం చేత విద్యుత్ స్తంభాలు, ఇల్లులు ఎప్పుడు కూలిపోతాయని రాత్రిపూట ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని నిద్రపోయే పరిస్థితి ఏర్పడింది అని గ్రామస్తులు భయందోలనకు గురవుతున్నారు కావున సంబంధించిన జిల్లా అధికారులు పట్టించుకోని మా ఇల్లు పక్కన సైడ్ గోడలు నిర్మించి శాశ్వత పరిష్కారం చేయాలని శ్రీపురం గ్రామస్తులు కోరుతున్నారు.

## డెంగ్యూ జ్వరంతో విద్యార్థిని మృతి

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** పలమనేరు నియోజకవర్గం, బైరెడ్డి పల్లి మండలం, నెల్లిపట్ల పంచాయితీ, ఓటేరుపాళ్యం గ్రామానికి చెందిన గుణశేఖర్ కుమార్తె రక్షిత (12) కడపనత్తం హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నది. గత10 రోజులుగా డెంగ్యూ జ్వరంతో తిరుపతి రుయా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. విద్యార్థిని రక్షిత మరణ వార్త తెలుసుకొన్న గ్రామస్థులు, ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు శోక సముద్రంలో మునిగిపోయారు.



## డీ ఎం పురం ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా గణితం అవగాహనతో నేర్చుకోకుంటే గణితం ఒక రాక్షసి లా బయపెడుతుందని ప్రదర్శన చేసిన డీ.ఎం. పురం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి కమల్. పరీక్షల కారణంగా 26వ తేదీన గణిత దినోత్సవం నిర్మిస్తున్నట్లు హెచ్.ఎం కేశవులు తెలిపారు. విద్యార్థులు 50గణిత నమూనాలు ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ త్యాగరాజు ఉపాధ్యాయులు సరస్వతి, హరిత, మాలతి, సుమతీ, సుబ్రమణ్యం రెడ్డి, డిల్లి బాబు, చిన్నయ్య చెట్టి, తిరుమల రాజు, రాములు, రంజిత్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణితం శాస్త్రం సైన్స్ అండ్ టెక్నాలజీకి మూలస్తంభం



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ ధనంజయ రెడ్డి ఆధ్వర్యంలో "జాతీయ గణిత దినోత్సవం"జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయులు రెడ్డి మాట్లాడుతూ గణిత శాస్త్రం అన్ని శాస్త్రాలకు మూల స్తంభం వంటిదని, మానవ నాగరికత పురోగతికి గణితశాస్త్రం ఎంతగానో తోడ్పడిందని తెలియజేశారు. గణిత శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ ధనంజయ రెడ్డి గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జీవిత విశేషాలను వివరించారు. గణితశాస్త్రంలో రామానుజన్ సేవలకు గుర్తింపుగా భారత కేంద్ర ప్రభుత్వం ఆయన జయంతి డిసెంబర్ 22 తేదీని జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించిందని, 2012వ సంవత్సరం నుంచి ప్రతి ఏడాది జాతీయ గణిత దినోత్సవం జరుపుకుంటున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా రామానుజన్ సంఖ్య 1789 గురించి వివరించారు. గణితంలో నిష్ణాతులైతే ఏ శాస్త్రంలోనైనా రాణించగలరని విద్యార్థులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ సీఎన్ లత, జోగి ప్రసాద్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల అభివృద్ధికి ప్రత్యేక కృషి



**రొంపిచెర, మేజర్‌న్యూస్:** దివ్యాంగులు అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు తెలిపారు. రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో, హైస్కూల్ వీధిలో అనారోగ్యంతో బాధపడుతున్న దిలీప్ ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అన్నింటినీ అందించేందుకు ముందుంటామన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చే స్టిక్కులు, బ్యాటరీ సైకిల్, వినికిడి యంత్రాలు, వీల్ చైర్ లు, టాయిలెట్ చైర్ లను అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని అన్నారు. పుంగనూరు నియోజకవర్గ కేంద్రంలో జరిగిన దివ్యాంగుల సమావేశానికి హాజరై మండలంలోని దివ్యాంగుల సమస్యలపై అధికారులతో చర్చించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి మహ్మదలీ, కార్యవర్గ సభ్యులు బాషా, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

## రెండు వాహనాలకు ఓకే నంబర్... స్వాధీనం చేసుకున్న పోలీసులు

**కార్వేటి నగరం మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం మండలం చిత్తూరు నుండి పుత్తూరు మెయిన్ రోడ్డులోని అమ్మపల్లి క్రాస్ వద్ద ఉదయం స్థానిక ఎస్సై రాజు కుమార్, సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించాను, వాహనం తనిఖీ చేస్తున్న సమయంలో రెండు టీఏటీఏ గూడ్స్ క్యారియర్ వాహనాలు మా వైపు వచ్చాయి, రెండు టాటా ఏసీఈ గూడ్స్ వాహనాలపై ఒకే రిజిస్ట్రేషన్ నంబర్ ఉంది. అప్పుడు రెండు గూడ్స్ వాహనాల యజమానిని విచారించగా అతని పేరు హేమ కుమార్, ఈదువారిపల్లి గ్రామం, కార్వేటినగరం మండలం, చిత్తూరు జిల్లా, అతను చెప్పాడు. ఒక వాహనం కోసం వాహన రికార్డులను కలిగి ఉండటం అంటే, గూడ్స్ క్యారియర్ బేరింగ్ నెం. ఏపీ-04-వి-5035, అతని వద్ద మరొక గూడ్స్ వాహనం కోసం రికార్డులు లేవు. కాబట్టి, పోలీ సులు చలాన్‌లను తప్పించుకోవడం కోసం, అతను రెండు వాహనాలకు రిజిస్ట్రేషన్ నంబర్ ఎపి04వి5035ని ఫిక్స్ చేశాడు. తదుపరి చర్యలు తీసుకునేందుకు రెండు టాటా ఏసీఈ గూడ్స్ వాహనాలను సేఫ్ కస్టడీ కోసం కే నగర్ పీఎస్‌కు తరలించారు. తదుపరి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.




# క్రీడల్లో రాణిస్తే నిజ జీవితంలో మంచి భవిష్యత్తు ఉంటుంది

### - విద్యార్థులకు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సూచన

**పుత్తూరు, మేజర్‌న్యూస్:** క్రీడల్లో రాణిస్తే నిజజీవితంలో మంచి భవిష్యత్తు ఉంటుందని నగరి నియోజకవర్గ. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ విద్యార్థులకు తెలిపారు. ఆదివారం పుత్తూరు ఎస్ ఆర్ ఎస్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి అండర్ 19 బాల బాలికల ఖో ఖో ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా నగిరి శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ విచ్చేసి క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగారు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సాహించడానికి క్రీడలలో వున్న క్రీడా కోటాను రెండు నుండి మూడు శాతానికి పెంచి క్రీడాకారులకు మంచి ఉజ్వల భవిష్యత్తు ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా క్రీడల్లో రాణిస్తే నిజజీవితంలో మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సూచించారు. క్రీడల్లో రాణిస్తే నిజజీవితంలో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అదేవిధంగా మన ఆంధ్ర ప్రదేశ్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి ప్రోత్సాహాలు ప్రకటించారని తెలిపారు. భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ ని క్రీడాంధ్రప్రదేశ్ గా మార్చాలని కృత నిశ్చయంతో ఉన్నారని కొనియాడారు. అనంతరం ఖో ఖో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జయరామయ్య, తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబు, అబ్జర్వర్ ఈశ్వర్ నాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## కందలి గ్రామంలో ఫ్రీ క్రిస్మస్ వేడుకలు



**గూడూరు రూరల్, మేజం న్యూస్:** మండలంలోని కందలి గ్రామంలోని సీయోను ప్రార్దనా మందిరంలో ముందస్తు క్రిస్మస్ సంబరాలలో నిర్వహించారు. ఆదివారం ఉదయం విశ్రాంత ఉపాధ్యాయిని కూరపాటి మెర్సిమ్మ జాపకార్థం వయోవృద్దులకు,పిల్లలకు చలి కంబళ్ళను సంఘకాపరి బ్రదర్ బాబ్జి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన యస్సీ,యస్టి అట్రాసిటి కమిటి సభ్యులు కూరపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ మా అప్పుడు బాబ్జి ప్రార్దనామందిరాన్ని సందర్శించి వయోవృద్దులను సత్కరించడం మాకు సంతృప్తిగా భావిస్తున్నామన్నారు. మాకుటుంబ సభ్యులందరూ ఈకార్యక్రమంలో పాల్గొనడం మరింత సంతోషమన్నారు. అనంతరం మందిరంలోని విశ్వాసులందరికీ పండ్లు ఫలహారాలను పంచిపెట్టారు .పైకార్యక్రమంలో సంఘ సహవాసులు బాస్ స్వచ్ఛంధ సేవా సంస్థ భాధ్యులు కార్యదర్సి సుప్రియ యశ్వంత్ భావన తదితరులు పాల్గొన్నారు.

## గౌడ్ కులస్తులు ఆత్మీయ సమావేశం




**పలమనేరు, మేజర్‌న్యూస్:** పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న బంగారుపాళ్యం వజ్రాలపురం లో వెలసియుండు శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానం నందు జిల్లా గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9:30కు నిర్వహిస్తున్న 21వ ఈడిగ గౌడ్ కుల ఆత్మీయ వనభోజన సమారాధన మహొూత్సవానికి జిల్లాలోని ఈడిగా గౌడ్ కులస్తులు, గౌడ్ ఉద్యోగులు, కుటుంబ సమేతంగా విచ్చేసి నిర్వహిస్తున్న వివిధ రకాల ఆటలు, పాటలు నృత్య పోటీలలో పాల్గొని సహ బంతి భోజనాలు చేసి ఒకరినొకరు పరిచయము చేయు కార్యక్రమంలో పాల్గొని గెలుపొందిన వారికిబహుమతులు ప్రధానం చేయబడునని తెలిపారు. ఇందులో కార్యక్రమ వివరాలు శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానము నందు అమ్మవారికి అభిషేకం పిల్లలకు పెద్దలకు మహిళలకు వృద్ధులకు వేరువేరుగా ఆటల పోటీలు, పాటల పోటీలు,డాన్స్ పోటీలు,గౌడ్ వివాహ పరిచయ వేదిక సహ బంతి భోజనము చేయబడును. జయసింహ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 10వ తరగతిలో550 మార్కులు పైగా ఇంటర్మీడియట్ లో 950 మార్కులు పైగా వచ్చినవారికిబహుమతులు ప్రధానం చేయబడును. ఈ కార్యక్రమానికి మన ఈడిగా గౌడ్ కుటుంబ సభ్యులందరూ అత్యధిక సంఖ్యలో పార్టీలకు అతీతంగా మన ఐక్యతను చాటే విధంగా ఇందులో పాల్గొని వనభోజనమును స్వీకరించి మన సంఘం పెద్దల సందేహాలు విని మన సంఘీయుల అభివృద్ధి కొరకు అందరూ కదలి రావాలని రాష్ట్ర గౌడ సంఘం కార్యదర్శి బుసా నాగరాజు గౌడు, జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల గోపి గౌడ్, జిల్లా అధ్యక్షులు మద్దిలేటి కృష్ణమూర్తి గౌడ్ తెలియజేశారు.

## ఏనుగుల దాడిలో మృతి చెందిన శంకరప్పకు నివాళులు



**పలమనేరు, మేజర్‌న్యూస్:** నియోజకవర్గం లోని బైరెడ్డి పల్లి మండలం కుప్పనపల్లి గ్రామానికి చెందిన శంకరప్ప నిన్నటిరోజు ఒంటరి ఏనుగు దాడిలో మరణించిన విషయం తెలుసుకొని ఆదివారం కుప్పనపల్లి లోని వారి నివాసం వద్దకు బైరెడ్డిపల్లి మండల, పంచాయతీ నాయకులు, గ్రామస్థులతో చేరుకొని శంకరప్ప పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన పలమనేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ....ప్రభుత్వం వారు శంకరప్ప మృతికి పరిహారంగా ప్రకటించిన ఎక్షిగ్రెసియాను పెంచి వీలైనంత తొందరగా బాధిత కుటుంబ సభ్యులకు అందించాలని,అలాగే ఈ ఏనుగు దాడులను అరికట్టడానికి కృషి చెయ్యాలని సంబంధిత ప్రభుత్వ అధికారులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంటకృష్ణ మూర్తి, వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి స్పీడ్ స్కేటింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు జిల్లా 3 వ స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు 2024-25 ఆదివారం ముగిశాయి. స్థానిక మురుగానిపల్లిలోని న్యూయార్క్ పాఠశాల స్కేటింగ్ క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్ - 4 నుంచి అండర్ - 16 స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 50 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్పీడ్ స్కేటింగ్ క్రీడా అసోసియేషన్ కార్యదర్శి, జిల్లా చీఫ్ కోచ్ కార్తీక్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులు ఈనెల 28, 29 వ తేదీల్లో తిరుపతి నగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. అదే విధంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటిన క్రీడాకారులు వచ్చే ఏడాది జనవరి 31వ తేదీతో పాటు ఫిబ్రవరి 1, 2 వ తేదీల్లో తమిళనాడు రాష్ట్రం మధురైలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 200, 400, 1000 మీటర్ల విభాగాలకు నిర్వహించిన స్కేటింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలకు క్రీడాకారుల నుంచి మంచి స్పందన రావడం హర్షనీయమన్నారు. జిల్లా నుంచి అత్యుత్తమ స్కేటింగ్ క్రీడాకారులను తయారుచేయడమే ధ్యేయంగా తాను కోచింగ్ ఇస్తున్నట్లు కార్తీక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు ఎంపిక పోటీల పరిశీలకులు శ్రీమన్నారాయణరెడ్డి, అసిస్టెంట్ కోచ్లు లోక, వరుణ్ తో పాటు క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## యుటిఎఫ్ మహాసభలో ఎమ్మెల్యే బొజ్జల



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం ఉపాధ్యాయులు ఆహ్వానం మేరకు తిరుపతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మహా సభలకు ముఖ్య అతిధిగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి హాజరు కావడం జరిగింది.

## జనసేన పార్టీలోకి భారీ చేరికలు



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** జనసేన పార్టీలోకి ఇతర పార్టీల నుండి సుమా 200 మంది మండలంలోని భీమగానిపల్లి పంచాయతీలో జనసేన నేత వేణుగోపాల్ రెడ్డి సమక్షంలో ఆదివారం చేరారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పుంగనూరు రూరల్ మండలంలోనే భీమగాని పల్లికి జనసేనా పార్టీ తరపున ప్రత్యేక స్థానం ఉందని వారు ఎప్పుడూ జనసేనా పార్టీ పక్షాన నిలుస్తున్నారని వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పవన్ కళ్యాణ్ నిజాయితీ నిబద్ధత కలిగిన నాయకుడని ప్రతి ఒక్క జన సైనికుడు పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారుఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శివ కుమార్ రెడ్డి, విరూపాక్ష, చిన్నా రాయల్, నరేంద్ర రెడ్డి, పగడాల రమణ, నరేష్ రాయల్, చైతన్య రాయల్, జనార్ధన్, భాస్కర, కోదండ, హరిప్రసాద్, వెంకట రమణ రెడ్డి, శంకర్ రెడ్డి, రేవంత్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, అబ్దుల్లా కలామ్ పురస్కారం

**ఐరాల, మేజర్‌న్యూస్:** పాకాల మండలం పరిధిలోని దామల్ చెరువులో ఉన్న విజయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు విధులు నిర్వహిస్తున్న ఉప ధ్యాయులు కు, చదువుతున్న విద్యార్థులకు సుగుణ సైన్స్ అకాడమీ చివుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్ గుంటూరు వారిచే అబ్దుల్ కలామ్ పుష్కరాలును ఆదివారం ఉదయం అందజేశారు. ఆదివారం ఉదయం గుంటూరులో జరిగిన డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలామ్ 93 వ జయంతి వేడుకలు ముగింపు ఉత్సవాల్లో భాగంగా 14 వ రాష్ట్ర స్థాయి పోటీలు పురష్కరించుకొని, ఇ. మాధవి అనే ఉపాధ్యాయురాలుకి అబ్దుల్ కలామ్ విశిష్ట సేవ పురష్కారం, ఆర్. మహబూబ్బి నిష అనే ఉపాధ్యాయునికి అబ్దుల్ కలామ్ విజ్ఞన్ గురు పురష్కారం ఎస్.జయశ్రీ అనే ఉపాద్యాయురాలుకి అబ్దుల్ కలామ్ గురు పురష్కారం, హైంధవి, జితిన్ సాయ్, పుణ్యశ్రీ, దర్శన్, వంటి విద్యార్థులకు అబ్దుల్ కలామ్ ఇన్స్పి రేషనల్ ప్రతిభా పుష్కరాలను అందజేశారు. ఈసందర్భంగా దామల్ చెరువు విజయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ బి మల్లారెడ్డి డాక్టర్ ఏ పి జే అబ్దుల్ కలామ్ విశిష్ట సేవ, విజ్ఞన్ గురు, వంటి పరిష్కారాలు అందుకున్న ఇ.మాధవి, ఎస్.జయశ్రీ, అనే ఉపధ్యాయురాలులు కు, ఆర్ మహబూబ్బి నిష, అనే ఉపాధ్యాయులు కు, హైంధవి, జితిన్ సాయ్, పుణ్య శ్రీ, దర్శన్,వంటి విద్యార్థులను అభినందించారు.

## పూర్వవిద్యార్థుల ఆపూర్వ కలయిక



**చౌడేపల్లి మేజర్‌న్యూస్:** మండల కేంద్రం లోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వపు విద్యార్థులు 2004-2005వ సంవత్సరం పదవ తరగతి విద్యార్థి విద్యార్థునులు అపూర్వ కలయిక జరిగింది. చిన్నతనంలో ఆడి పాడిన పాఠశాలలను గురించి నెమరు వేసుకుంటూ విద్యార్థులు ఆనందంగా గడిపారు .20 ఏళ్ల తర్వాత కలసిన నేస్తాలు ఒకచోట కూర్చుని పాత జ్ఞాపకాలతో పాటు ప్రస్తుతం ఎవరేమి చేస్తున్నారన్న విషయాలను గురించి చర్చించుకున్నారు .చదివిన పాఠశాలకి తమ వంతు సాయం చేయాలని ప్రణాళికను రూపొందించుకున్నారు. సహపంక్తి భోజనాలు చేస్తూ ముచ్చటించుకొన్నారు. ఈ కార్యక్రమంలో 2004-2005 విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం బాటిళ్లు సీజ్



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలంలోని గోపిశెట్టిపల్లి దళితకు ఆరుముగం అతను మందు బాటిల్లను కలిగి ఉన్నాడని వచ్చిన సమాచారం మేరకు కార్వేటి నగరం ఎస్ఐ ఉత్తర్వుల మేరకు ఏఎస్సై ఎలుమలై రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి ముద్దాయి అయిన ఆరుముగం చిల్లర అంగడికి వెళ్ళగా, ఆరుముగం పోలీసులను చూసి పారిపోగా, అతని వద్ద ఉండినా ఏడు క్వార్టర్ బాటలను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం అయినది. ఎవరైనా మద్యం బాటిల్లను వారి స్వలాభం కొరకు ఇతరులకు అధిక ధరలకు అమ్మడం ఎక్కువ మందు బాటిల్ను కలిగి ఉండడం, చట్టరీత్యా నేరము, కావున ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలుపడమైనది.

## కాణిపాకం వరసిద్ధునికి నగదు, వెండి విరాళం

**ఐరాల, మేజర్‌న్యూస్:** కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి నిత్య అన్నదాన ట్రస్ట్ సికింద్రాబాద్ కు చెందిన రాజ్యలక్ష్మి అనేదాత రాలు 1 లక్ష 116 డి డి రూపంలో, ఆలయ సూపర్ డెంట్ చేతులు మీదగా అందజేశారు. అదేవిదంగా 1 కే జి 800 గ్రాములు 1లక్ష 85 వేలు రూపాయలు విలువ చేసే వెండి ఆభరణాలుప్రధాన ఆలయ అనుబంధ అలయమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వరధరాజులు స్వామి వారికి వెండి హస్తాలు, పాదాలు ను బెంగళూర్ కుచెందిన నవీన్ కుమార్ ఆలయ ఈవో కె.పెంచల కిషోర్ చేతులు మీదగా ఆదివారం ఉదయం విరాళంగా అందజేశారు. ఈ విరాళ ధాత లకుఆలయ సంప్రదాయ ప్రకారం ఈ విరాళధాతకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఎఈఓ రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**- కుప్పం హిందూ ధర్మ పరిరక్షణ వేదిక సభ్యులు**



**కుప్పం, మేజర్‌న్యూస్:** సనాతన ధర్మ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని నరేష్,హిందూ ధర్మ పరిరక్షణ వేదిక సభ్యులు పేర్కొన్నారు.కుప్పం పట్టణంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవస్థానంలో హిందు ధర్మ పరిరక్షణ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సనాతన సంప్రదాయాన్ని, ఘనమైన విలువలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఐక్యంగా ఉంటేనే హిందూ ధర్మం నాలుగు కాలాలపాటు మనుగడ సాగిస్తుందని స్పష్టం చేశారు.ధర్మానికి వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టడానికి ప్రజలు జాగృతం కావాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. అనైక్యత, నిర్లిప్తత కారణంగానే హిందూ సమాజం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ ఒక్కరు ధర్మ పరిరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. దేశంలో సనాతన ధర్మం కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్క యువత కృషీ చేయాలని తెలిపారు.ప్రతి నెల క్రమం తప్పకుండా హిందూ ధర్మ పరిరక్షణ ఆద్వర్యంలో సమావేశం నిర్వహించి, కుప్పం నియోజవర్గ వ్యాప్తంగా సనాతన ధర్మ పరిరక్షణకు కలిసి కట్టుగా ఐక్యమత్యంగా ముందుకు వెళ్లడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల హిందు ధర్మ పరిరక్షణకు వేదిక సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గంధం మహోత్సవం, అన్నదానంలో నగరి ఎమ్మెల్యే



**పుత్తూరు, మేజర్‌న్యూస్:** పుత్తూరు పట్టణంలోని గేటు పుత్తూరు జండామాను నాగూరు ఖాదర్ వలీ గంధపు మహోత్సవ అన్నదాన కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నబీ మస్తాన్, ఆధ్వర్యంలో నిర్వహించగా టిడిపి నాయకులు గాలి జీవ రత్నం నాయుడు, ఎన్ ఎన్ ధనపాల్, బాబు నాయుడు, బీ ఆర్ యుగంధర్, కేశవ ఆచారి, డిజి ధనపాల్, కేశవ, అశోక్, ముస్లిం మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ, కరీం భాయ్, సంసు, ,సాయి, హరి, సోము, యగుబాలు,జాబీర్ ,సలీమ్, అమీర్, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ కార్యకర్త ఆత్మహత్య బాధాకరం

**- జనసేన పార్టీ ఇంచార్జ్ కోటా వినుత చంద్రబాబు**



**ఏర్పేడు, మేజర్‌న్యూస్:** జనసేన పార్టీ ఏర్పేడు మండల నాయకుడు. క్రియా వాలంటీర్ సభ్యుడు లోకనాథం ఇంగొలు ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరం. దురదృష్టకరం. నియోజక వర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా వారి గ్రామం రావిళ్ళవారి కండ్రిగకి వెళ్లి వారి భౌతిక కాయానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. వారి దహనక్రియలకు 10,000 రూపాయలు సొంత డబ్బు లు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం వినుత చెయ్యడం జరిగింది. కుటుంబానికి అండగా పార్టీ అండగా ఉంటుందని, అతని కుమారుడు చదువు బాధ్యత చూసుకుంటామని బరోసా ఇవ్వడం జరిగింది.

## హ్యూమన్ రైట్స్ ఉపాధ్యక్షులుగా కామి వెంకటేశ్వర్లు



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** జాతీయ నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కామి వెంకటేశ్వర్లులను నియమిస్తూ ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎస్సీ, ఎస్టీ, ఓ బి సి సమస్యలపై స్పందించి ప్రజలకు అందుబాటులో ఉంటూ తన వంతు సేవలు అందిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిపబ్లిక్ క్లబ్ నందు ఆయనకు అనుచరులు కృతజ్ఞతలు తెలిపి అభినందించారు.

## కేంద్రంలో ఎన్డీయే కూటిమిని గద్దెదించడమే లక్ష్యం

**- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు**



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** భారతదేశంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు తెలిపారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తూ రాజ్యాంగాన్ని నిర్వీరం చేసి సొంత రాజ్యాంగాన్ని అమలు చేయడానికి బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ బీజేపీ తీసుకొచ్చిన జమిలి ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిరంజీవి, ఆంటోని, పవన్, పీఎంరాధా, డీవీసాగర్, గుణశేఖర్, ప్రభ, నవీన్, చందు, ప్రభాస్, అరుణ్, రాజశేఖర్, తేజ పాల్గొన్నారు.

## ప్రభుత్వ గృహాలు అభివృద్ధి కమిటీ ఏర్పాటు



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం వికృతమాల పంచాయితీలో ప్రభుత్వం నిర్మించిన గృహ సముదాయాలు వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ కార్యాలయాన్ని నీలాద్రి వర్క్స్ కమిటీ చైర్మన్ పూల హేమాక్షి. ఏఐటియుసి ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పి మురళీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు సంవత్సరాలు క్రితం గృహాలను లబ్ధిదారులకు కేటాయించడం జరిగిందని అయితే అభివృద్ధి పనులు చేపట్టక. ముళ్ళ పొదల్లో సైడ్ కాలవలు నిర్మాణం లేక వీధిలైట్లు వెలగక కొంతమంది ఆకతాయిల అసంఘిక కార్యక్రమాలతో నివాసముంటున్న ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్న తరుణంలో ఇక్కడ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా కాలనీ అభివృద్ధి ఏకైక అజెండాగా పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి. కే రాధాకృష్ణ లు మాట్లాడుతూ గతంలో కూడా చాలామంది అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేకుండా పోయిందని కాలనీలో నివాసమున్న ప్రజలందరూ కలిసి అభివృద్ధి కమిటీని ఏఐ టియుసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకోవడం అభివృద్ధి కమిటీ నిరంతరం అధికారులను స్థానిక నాయకులను కలిసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టండి అని జిల్లా కలెక్టర్. తిరుపతి మున్సిపల్ కమిషనర్. జిల్లా పంచాయతీ అధికారి ఎంపీడీవోలను నిరంతరం కలిసి పనులు చేపట్టాలని పదే పదే కలవడంతో అధికారులు చొరవతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వైయస్ మనీ. అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సిహెచ్ శివయ్యలు మాట్లాడుతూ కాలనీ ప్రజల ఐక్యత. అధికారుల సహకారం మరువలేనిదని ఇంకా ఇక్కడ అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని కమ్యూనిటీ హాలును అందుబాటులోకి తేవడం. రేషన్ షాపును ప్రభుత్వ పాఠశాలలను అంగన్వాడీ సెంటర్ ను ఒక బీహెచ్ఈని ఏర్పాటు చేసుకోవలసిన అవసరం వెంటనే ఉందని దానికోసం వెంటనే దశలవాది ఆందోళన పోరాటాలు అధికారులను కలవడం శాసన సభ్యుల సహాయంతో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేస్తాము అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం నారాయణస్వామి, ఎస్ గోవర్ధన్, ఆర్ సత్యనారాయణ, జి రాజగోపాల్ రెడ్డి, టి శ్రీనివాసులు రెడ్డి, ఏ వరప్రసాద్, జి పుష్పరాజు, టి బాబు, తిరుపతి గీత, పి. రాధా, ఎస్ రేష్మ, చిన్న పాపమ్మ, జ్యోతి, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే తిరుమల విజన్-2047 లక్ష్యం

## టీటీడీ ఈఓ జె.శ్యామల రావు

**తిరుమల, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు భక్తులకు మరింత నాణ్యంగా అన్న ప్రసాదాలు, వసతి, మౌలిక సదుపాయాలు. గత ఆరు నెలల్లో నాణ్యమైన అన్న ప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలు పంపిణీ, చాట్ జీపీటీ తరహాలో వాయిస్ ఆధారిత టీటీడీ చాట్‌బాట్ అభివృద్ధికి ప్రయత్నం. తిరుమల క్షేత్రాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే తిరుమల విజన్-2047 లక్ష్యమని టీటీడీ ఈఓ జె.శ్యామల రావు అన్నారు. తిరుమలలో గత ఆరు నెలల్లో జరిగిన అభివృద్ధిపై ఆయన తిరుమలలోని అన్నమయ్యభవనంలో ఆదివారం ఉదయం మీడియా సమావేశం నిర్వహించారు. విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలియజేశారు. ఈఓ మాట్లాడుతూ గత ఆరు నెలల్లో తిరుమలలో అనేక మార్పులు తీసుకొచ్చినట్లు తెలియజేశారు. భక్తులకు మరింత నాణ్యంగా అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. నాణ్యమైన నెయ్యితో లడ్డూ ప్రసాదాల తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్‌డీడీబీ విరాళంగా ఇచ్చిన రూ.70లక్షల పరికరాలతో టీటీడీ సొంతగా కల్తీ పరీక్షల ల్యాబ్ ఏర్పాటు



చేసినట్లు తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తిరుమలలో సాధారణ భక్తులకు పెద్దపీట వేస్తూ వారికి చక్కటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరుమల, తిరుచానూరు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించినట్లు తెలియజేశారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. క్యూలైన్ల నిర్వహణ, భక్తలు క్యూలైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండకుండా అదనపు ఈఓ నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. 45అతిథి గృహాలకు వారి సొంత పేర్లను తొలగించి, ఆధ్యాత్మిక పేర్లు ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. తిరుమలను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయనున్నామని పేర్కొన్నారు. 2019 తుడా మాస్టర్ ప్లాన్‌లో భాగంగా తిరుమల జోనల్ ప్లాన్‌ను తయారు చేయడం జరిగిందన్నారు. అయితే 2017 సంవత్సరం సమాచారం ఆధారంగా చేసిన ప్రతిపాదనలను ఆధునీకరించినట్లు తెలియజేశారు. దేశంలోనే ఇతర ఆలయాలకు ఆదర్శవంతంగా తిరుమల క్షేత్రాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. సుమారు 18 ప్రాజెక్టులకు ప్రణాళికల కోసం చేసేందుకు 9 సంపూర్ణ నివేదికలను తయారు చేస్తున్నట్లు చెప్పారు. తిరుమల విజన్-2047 లక్ష్యాలను వివరించారు.

**తిరుమల విజన్-2047 లక్ష్యాలు...** తిరుమల నడక మార్గాల ఆధునీకరణ, బహుళస్థాయి పార్కింగ్, స్మార్ట్ పార్కింగ్, నూతన లింక్‌రోడ్డుల నిర్మాణం, సబ్ వేల నిర్మాణం, రామ్ భగీచ, బాలాజీ బస్టాండులను పునర్నిర్మాణం. భక్తులకు వసతి కోసం అలిపిరి దగ్గర 40 ఎకరాల్లో బేస్ క్యాంప్ ఏర్పాటు, ఆధ్యాత్మికత ప్రతిబింభించేలా తిరుమలలో భవనాల రూపకల్పన, టీటీడీలో ఉన్న 31 మంది హిందూయేతర ఉద్యోగులను ప్రభుత్వ శాఖలకు పంపడం, లేదా వీఆర్ఎస్ ఇవ్వాలని బోర్డు నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. తిరుమలలో రోడ్ల ఆక్రమణ చేస్తూ భక్తులకు ఇబ్బంది కలిగిస్తున్న దుకాణదారులు, హాకర్ లైసెన్సుదారుల, అనధికార తట్టలపై కఠిన చర్యలు. తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణ, అవసరమైన పార్కింగ్, మౌలిక సదుపాయాలు, మాడ వీధుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి. ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాల్లో అభివృద్ధికి చర్యలు. సనాతన హిందూ ధర్మ ప్రచారం, పరిరక్షణలో యువతను భాగస్వామ్యం చేసేందుకు కృషి. ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సహకారంతో యువతలో ఆధ్యాత్మికత పెంచేలా చర్యలు. ఇప్పటి వరకు చేపట్టిన హెడీపీపీ కార్యక్రమాలపై ఆడిట్ నిర్వహించి మరింత మెరుగ్గా కార్యక్రమాలు నిర్వహణ. తిరుమలలోని ప్రైవేట్‌క్యాంటీన్లలో ధరలు నియంత్రించి, పేరొందిన సంస్థలకు నిర్వహణా బాధ్యతలు అప్పగించి నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు. తిరుమలలో వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక చర్యలు, వర్షపు నీరు, మురుగు నీరు వేర్వేరుగా వెళ్లేలా డ్రెయిన్ల నిర్మాణం. సాంకేతిక పరిజ్ఞానంతో భక్తులకు నిర్ణీత సమయంలో దర్శనం, వసతి అందించేలా చర్యలు. చాట్ జీపీటీ తరహాలో వాయిస్ ఆధారిత టీటీడీ చాట్ బాట్ అభివృద్ధికి ప్రయత్నం. గతంలో ఉన్న వ్యవస్థపరమైన లోపాలను అడ్డుపెట్టుకుని భక్తులను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు. ఎప్పటికప్పుడు పోలీసులు, విజిలెన్స్ సహకారంతో దళారుల నియంత్రణ.టిటిడి ఆధ్వర్యంలో ఉన్న 61 ఆలయాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈఓ వెంకయ్యచౌదరి, జేఈఓ గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గురూజీ ఆశ్రమంలో కేంద్ర మంత్రి

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** సి.రామాపురం సమీపంలోని



బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాత్ ఆదివారం సందర్శించారు. ఆశ్రమంలో నిర్వహిస్తున్న అష్టలక్ష్మి ఉత్సవంలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గురూజీ ఆశీర్వాదం పొందారు.

# వరసిద్ధుని సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

**ఐరాల, మేజర్‌న్యూస్:** కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వార ని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి చల్లా గుణరంజన్ ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి సందర్శనార్థం విచ్చేసిన వారికి ఆలయ సాంప్రదాయ ప్రకారం రాజగోపురం వద్ద ఆలయ ఎఈఓ రవీంద్ర బాబు, ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, వేదపండితులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత ఆలయ అశ్వరచన మండపంలో వేదపండితుల చే అశ్వరచన చేసిన తరువాత ఆలయ సూపరింటెండెంట్ వాసు చేతులు మీదగా స్వామి వారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలు, శేష వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, చిత్తూరు కోర్టు సిబ్బంది, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.





# నా గెలుపునకు వన్నెకుల క్షత్రియులే కారణం

## ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తాత, నాన్న, నాకు సహకరించిన వన్నెకుల క్షత్రియులందరికి పాదాభివందనాలు చేసిన ఎమ్మెల్యే బొజ్జల ఆదివారం తిరుపతిలో ఏర్పాటు చేసిన వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ సమావేశానికి హాజరైన శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వన్నెకులక్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, నారా లోకేష్‌కి, కూటమి అదినాయకుల అందరికీ ధన్యవాదాలు తెలిపారు. సిఆర్ రాజన్న మానాన్నకి అత్యంత సన్నిహితులు వారికి చైర్మన్ పదవి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. శ్రీకాళహస్తి నుంచి నలుగురికి డైరెక్టర్లుగా అవకాశం కలిపించడం సంతోషంగా ఉందన్నారు. నూతనంగా ఏర్పడిన కార్పొరేషన్ సభ్యులు ప్రతి ఒక్క పేదవారికి సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.

# మహిళల అభివృద్ధికి పెద్దపీట

## చంద్రబాబు విజనరీ రాష్ట్రానికి ఎంతో అవసరమని నారా భువనేశ్వరి

**వి.కోట, మేజర్‌న్యూస్:** చిత్తూరు జిల్లా వి.కోట తెలుగుదేశం ప్రభుత్వం మహిళా అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ముఖ్యమంత్రి భార్య నారా భువనేశ్వరి తెలిపారు వీకోట ఉప మార్కెట్ యార్డులో ఎన్టీఆర్ సుజల మంచినీటి శుద్ధికేంద్రాన్ని పున ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వం మహిళలు అభివృద్ధికి పాటుపడుతోందన్నారు. మహిళల సంక్షేమానికి వాళ్ళు పథకాలు ప్రవేశపెట్టిందాన్నారు మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన సభ ప్రాంగణం వద్దకు కుప్పం నుండి ఆమె వి.కోటకు చేరుకున్నారు మహిళలు హారుతులతో స్వాగతం పలికారు. రూ.5లకే 20 లీటర్ల శుద్ధ జలం విక్రయ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఇప్పుడు అదే మహిళా సంఘాలు దేశంలోనే ఎక్కడ లేనివిధంగా వృద్ధి సాధిస్తున్నాయని అన్నారు. మహిళల ఎదుగుదల రాష్ట్రానికి, దేశానికీ ఎంతో అవసరమన్నారు. మహిళలు ఎప్పుడు ఉన్నత స్థితికి చేరుకుంటారో అప్పుడే అన్ని విధాలా సమాజం అభివృద్ధి చెందుతుందని గట్టిగ నమ్మే వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. అందుకోసం గతంలోనే మహిళల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. అప్పుడు డ్వాక్రా పొదుపు సంఘాలను ఏర్పాటు చేస్తాం అని ప్రకటించినపుడు చాలా మంది ఎగతాళి చేసారని మహిళలకు ఇవన్నీ అవసరమా అని ప్రశ్నించ్చారన్నారు. ఒక్క డ్వాక్రా మహిళా సంఘాలే కాకుండా ఎన్నో రకాల సంక్షేమ కార్యక్రమాలు తీసుకొచ్చారన్నారు. కుప్పం ప్రజలకోసం చేసిన కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఇక్కడ రైతుల కోసం దేశంలోనే మొట్టమొదటి సరిగా కుప్పంలో ఇజ్రాయిల్ తరహా వ్యవసాయాన్ని పరిచయం చెయ్యడమే కాకుండా వ్యవసాయంలో పెద్దవిప్లవమే తెచ్చారన్నారు. పలమనేరు ఎమ్మెల్యే యన్.అమరనాథ రెడ్డి, మండల టిడిపి నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిలో తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన, చేపడుతున్న కార్యక్రమాలపై వివరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పలమనేరు మాజీ మార్కెట్‌కమిటీచైర్మన్ రామచంద్ర నాయుడు, మండలపార్టీ అధ్యక్షులు రంగనాథ్, చిత్తూరు జిల్లా స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు త్యాగరాజు, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, సీనియర్ నాయకులు చౌడప్ప, రాంబాబు నాయుడు, వి.కోట పంచాయతీ అధ్యక్షులు, తెలుగు యువత నాయకులు ధీరజ్, శబరీష్, సతీష్, అమర, గజేంద్ర, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శివకుమారి పాల్గొన్నారు.



జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్: 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్: 6301107116